సాక్షి
వికారాబాద్
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



భూలోక స్వర్గం.. భూకైలాస్

శివాలయాలు శివరాత్రికి సిద్ధం అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. 8లో▸



మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా

మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో తాండూరు వాసులు సత్తా చాటారు. 8లో▸



సోలార్ కంచె..

పంటలను అడవి జంతువులు, వానరాలు, వన్యప్రాణుల నుంచి రక్షించుకోవడానికి సోలార్ కంచె వినియోగిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఫ్రీ చికెన్ స్నాక్స్ మేళా



చికెన్ పకోడీ, గుడ్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అనంతగిరి: కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకిన కారణంగా ప్రజలు గుడ్లకు, చికెన్‌కు దూరంగా ఉంటున్నారు. చికెన్, కోడిగుడ్లలో పోషక విలువలపై ప్రజల్లో అవగాహన పెంచాలనే ఉద్దేశంతో వికారాబాద్‌లోని ఎన్నేపల్లి చౌరస్తాలో ఫ్రీ చికెన్ స్నాక్స్ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా ఉడికించిన కోడిగుడ్లు, చికెన్ పకోడీ పంపిణీ చేశారు. వెన్‌కాబ్, ఏకే చికెన్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. డబ్ల్యూహెచ్‌ఓ ప్రకారం 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికించిన చికెన్, గుడ్లలో ఎలాంటి వైరస్ ఉన్నా చనిపోతుందని తెలిపారు.

ప్రజావాణికి 109 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్

అనంతగిరి: ప్రజావాణికి 109 దరఖాస్తులు అందాయి. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా సంతోష



నియామకపత్రం అందుకుంటున్న సంతోష

బంట్వారం: మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా బంట్వారం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కె.సంతోష నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబా, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. పదవి అప్పగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ధారూరు ఎస్‌ఐగా అనిత



ధారూరు: దారూరు ఠాణా నూతన ఎస్‌ఐగా బి.అనిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న వేణుగోపాల్‌గౌడ్ ఈ నెల 11న ఏసీబీకి పట్టుబడడంతో జైలుకెళ్లారు. దీంతో వికారాబాద్ ఎస్‌ఐగా పనిచేస్తున్న అనితను ధారూర్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఎస్పీ నారాయణరెడ్డి ఉత్తర్వులిచ్చారు.

రిఫ్రిజిరేటర్ మీద పడి వ్యక్తి మృతి

మొయినాబాద్: నిద్రమత్తులో రిఫ్రిజిరేటర్ వెనకభాగాన్ని లాగడంతో ప్రమాదవశాత్తు మర్మాయవాలపై పడి ఓ వక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన బసగల్ల యాదయ్య(46) ఈ నెల 19న రాత్రి 10 గంటలకు నిద్రమత్తులో లేచి నీళ్లు తాగడానికి రిఫ్రిజిరేటర్ వద్దకు వెళ్లాడు. ముందు వైపు నుంచి రిఫ్రిజిరేటర్ డోర్ తీయకుండా వెనక వైపు వెళ్లి రాడ్డు పట్టుకుని లాగాడు. దీంతో రిఫ్రిజిరేటర్ అతనిపై పడి, మర్మాయవాలకు తీవ్రగాయం అయింది. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని చికిత్సకోసం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. 20న నగరంలోని గాంధీకి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ 23న రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దర్జాగా దందా!

అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తూ కలపను అక్రమంగా తరలిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. ఆయా శాఖల అధికారులు మామూళ్ల మత్తులో అటువైపుగా కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అనుమతులు లేకుండా చెట్ల నరికివేత
- టార్పాలిన్ల మాటున అక్రమ రవాణా
- రాత్రికి రాత్రే నగర శివారుకు తరలింపు
- అధికారుల కనుసన్నల్లోనే అక్రమ వ్యాపారం..?



వికారాబాద్ మండల పరిధిలో నరికిన చెట్లు



కలప కనిపించకుండా కప్పిన టార్పాలిన్లు

వికారాబాద్: కలప దందా జిల్లాలో యథేచ్ఛగా కొనసాగతోంది. పగలు చెట్లను నరుకుతూ రాత్రిళ్లు రవాణా చేస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజుకు పదుల సంఖ్యలో లారీలు కలపను నగర శివారు ప్రాంతాలకు తరలిస్తుండగా.. స్థానికంగా ఉన్న కట్టె కోత మిషన్లు సైతం ఈ దందాకు అడ్డాగా మారుతున్నాయనే అపవాదు మూటగట్టుకున్నాయి. జిల్లాలోని ప్లై ఉడ్ ఫ్యాక్టరీలకు సైతం రోజుకు పదుల సంఖ్యలో కలప తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే చెట్లు నరుకుతూ లారీల కొద్దీ కలప అక్రమంగా రవాణా చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ఇటీవల యువత, ఇతర సామాజికవేత్తల నిఘా పెరిగి పోలీసులు, ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేస్తుండడంతో లారీల్లో కలప కనిపించకుండా ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లు కప్పి తరలిస్తున్నారు. భూమి చదును పేరిట వందల చెట్లను నేలకూలుస్తున్నారు. జిల్లలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ ఫారెస్ట్ రేంజ్‌లలో కలప అక్రమ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నచందంగా కొనసాగుతోంది.

ముడుపులు చెల్లించకుంటే కోర్టుకు..

ఈ అక్రమ దందాల్లో పాలుపంచుకుంటున్నందునే నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారని పర్యావరణ వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పుడప్పుడు పట్టుబడుతున్న కలప లారీలకు నామామాత్రపు ఫైన్లు వేస్తుండడం అటవీ శాఖ డొల్లతనాన్ని బట్టబయలు చేస్తోంది. రూ.లక్షలు విలువ చేసే కలపకు ఒక్కో కేసులో సగటున రూ.8 వేల నుంచి రూ.10వేలు ఫైన్ వేసి వదిలేస్తున్నారు. పర్యావరణ హితులు కలగచేసుకుని లారీలను పట్టించడమో.. పోలీసుల సాధారణ తనిఖీలు.. పెట్రోలింగ్ సమయంలో పట్టుపడడం తప్పిస్తే చెట్లు నరకడం, అక్రమంగా రవాణా చేయడం, విక్రయాలపై నిఘా కొరవడిందని తెలుస్తోంది. వారు కూడీ తమ చేతులు తడపని వ్యక్తులనే పట్టుకుంటున్నారని కలప వ్యాపారులు పేర్కొంటున్నారు. పోలీసులకు అనుకోకుండా తమకు మామూళ్లు ఇచ్చే వాహనాలు చిక్కినా.. చిక్కాక చేతులు తడిపినా ఆ కేసులు అటవీ శాఖకు బదిలీ చేస్తుండగా తమకు ముడుపులు అందని లారీలు చిక్కితే మాత్రం కేసులు పెట్టి కోర్టుకు తరలిస్తున్నారనే విమర్శలున్నాయి.

రూ.లక్షల్లో ముడుపులు?

కట్టె కోత మిషన్లకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న కార్పెంటర్ షాపుల్లో అక్రమంగా రవాణా చేసిన కలపను అందమైన ఆకృతుల్లోకి మార్చుతూ లక్షల్లో ఆర్జిస్తున్నారు. చెట్లు నరకడం, అక్రమ రవాణా, విక్రయాలను నిలువరించాల్సిన అటవీ, రెవెన్యూ, పోలీసులు అక్రమార్కులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెట్లను నరికే సమయంలో రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరైనా అది ఎక్కడా కనిపించడం లేదు. జిల్లాలోని ఫారెస్ట్ రేంజర్‌కు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు అక్రమార్కుల నుంచి ముడుపులు అందుతున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో ఉన్నతాధికారులకు సైతం వాటాలున్నందునే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

పటిష్ట నిఘా

ఇప్పటికే పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశాం. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికినా, తరలించినా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అనుమతులు లేకుండా చెట్లు నరికినా.. అక్రమంగా కలప రవాణా చేసినా తమకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించం. ఫారెస్టు అధికారులు లంచం అడిగినా తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– జ్ఞానేశ్వర్,, డీఎఫ్‌ఓ, వికారాబాద్



ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న హుండీ లెక్కింపు

ముగిసిన జాతర

- పల్లకీ సేవతో ఎల్లమ్మ తల్లి ఉత్సవమూర్తి తరలింపు
- ప్రత్యేక పూజలు చేసిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- అమ్మవారి హుండీ లెక్కింపు పూర్తి

బొంరాస్‌పేట: పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. సల్లంగ దీవించు ఎల్లమ్మ తల్లీ అంటూ భక్తులు జాతర నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ జయ రాములు, ఈఓ రాజేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు మధ్యాహ్నం హుండీ లెక్కింపును ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు రూ.3 ,65,534 నగదు, 1,100 గ్రాము ల వెండిని అమ్మవారికి కానుకగా సమర్పించుకున్నారు. రాత్రి 8గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీ సేవతో గ్రామంలోని ఆలయానికి తరలించారు.

స్పీకర్ ప్రత్యేక పూజలు

ఉత్సవాల్లో చివరిరోజైన సోమవారం శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనతరం ఆయనకు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ ఉత్సవాల్లో రేణుక ఎల్లమ్మ యువజన సంఘం అధ్యక్షుడు బుగ్గప్ప, మాజీ చైర్మన్ ముచ్చటి వెంకటేశ్, ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్యగౌడ్, నర్సింలు ముదిరాజ్, నర్సింలు, లక్ష్మి, రాములు, మునికుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి పూజలో స్పీకర్ ప్రసాద్‌కుమార్



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిహారం సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: పారిశ్రామిక వాడ ఏర్పాటులో భూము లు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెక్కులు అందజేశామని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేటకు సంబంధించిన రైతులకు ఆయన తాండూరు సబ్–కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్‌తో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. పరిహారం అందుకున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హకీంపేటలో 93.16 ఎకరాల భూమిని బహుళార్థక సాధక పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు 62 మంది రైతులు సమ్మతి తెలపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ ఓఓటీ శారద, అసిస్టెంట్ జాయింట్ మేనేజర్ అజీమా సుల్తానా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, దుద్యాల తహసీల్దార్ కిషన్, హకీంపేట రైతులు పాల్గొన్నారు.

108 వాహనంలో ఆకస్మిక తనిఖీ



షాద్‌నగర్: పట్టణంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని సోమవారం జిల్లా ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ మేనేజర్ రాజబాబు, ఆడిటింగ్ హెచ్‌ఓ ఫకీర్‌దాస్ తనిఖీ చేశారు. వాహనంలోని ప్రాథమిక చికిత్స పరికరాలు, మెడికల్ కిట్, ఇతర రికార్డులను పరిశీలించారు. అత్యవసర సమయంలో బాధితులకు అందజేస్తున్న సేవల గురించి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పవన్‌కుమార్, పైలెట్ అనిల్‌కుమార్ యాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత సిబ్బందికి ఉందని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణులు, పాముకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

కార్మికులకు కనీసం వేతనం ఇవ్వండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్

అనంతగిరి: మున్సిపల్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇళ్లు లేని కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వేతనాలు పెండింగ్‌లో పెట్టకుండా నెలా నెలా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, బుచ్చయ్య, దశరథ్, గట్టయ్య, రత్నం, కమలమ్మ, మరియమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఐ బోధనతో సత్ఫలితాలు

- ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు సహకారంతో విద్యను బోధించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. సోమవారం గడిసింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమాహారతి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో సాంకేతిక విద్యను ప్రవేశపెట్టిందన్నారు. ఏఐ విద్యావిధానం అమలుకు జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఆరు ప్రాథమిక పాఠశాలలో ప్రారంభిస్తుందన్నారు. విద్యార్థులకు పూర్తిగా ఏఐ ద్వార్వానే బోధన సాగుతుందన్నారు. ఉపాధ్యాయులు సైతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకా దేవి, ఏఎంఓ రామ్‌మస్తాన్, మండల విద్యాధికారి గోపాల్, వెంకట అనంత రావు తదితరులు పాల్గొన్నారు.

బొంపల్లి పాఠశాలలో ఏఐ డిజిటల్ ల్యాబ్

దోమ: ప్రభుత్వ విద్యార్థులందరికీ కంప్యూటర్ ఆధారంగా విద్యాబోధన చేయాలని ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. సోమవారం ఆమె మండల పరిధిలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏఐ డిజిటల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నేర్చుకుంటున్న తీరును పరిశీలించారు. ఏఐ విధానంలో విద్యార్థుల పొరపాట్లను కంప్యూటర్ గుర్తించి వారిని అప్రమత్తం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నరేందర్, ఎంఈఓ వెంకట్ ఏఎస్‌ఓ రమేశ్, హెచ్‌ఎం షఫీ, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి మీన, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నసీమా, సీఆర్పీ వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దోమ: బొంపల్లి పాఠశాలలో ఏఐ తరగతులను పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి

తలసరిలో టాప్

ప్రథమ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా
- సగటున రూ.11.46 లక్షల రాబడి
- దేశంలోనే అత్యధిక వార్షిక ఆదాయం
- ఐటీ, ఫార్మా కంపెనీలు, రియల్ పెట్టుబడులు
- పుష్కలంగా ఉపాధి అవకాశాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. 2023–24లో తలసరి సగటు ఆదాయం రూ.11.46 లక్షలుగా తేలింది. ఆ తర్వాతి స్థానంలో హర్యానాలోని గుర్గావ్ (రూ. 9.05లక్షలు) ఉండగా, కర్ణాటకలోని బెంగళూరు (రూ.8.93 లక్షలు), యూపీలోని గౌతంబుద్ధనగర్ (రూ.8.48 లక్షలు), హిమాచల్‌ప్రదేశ్‌లోని సోలాన్(రూ.8.10 లక్షలు), గోవా (రూ.7.64 లక్షలు), సిక్కిం (రూ.7.46 లక్షలు), మహారాష్ట్రలోని ముంబై (రూ.6.57 లక్షలు), గుజరాత్‌లోని అహ్మదాబాద్ (రూ.6.43 లక్షలు), తెలంగాణలోని హైదరాబాద్(రూ.5.39 లక్షలు), తమిళనాడులోని చెన్నై (రూ.5.20 లక్షలు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న మన జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు వెల్లడైంది.

పెరిగిన ఉపాధి అవకాశాలు

తలసరి వార్షికాదాయంలో తెలంగాణలోనూ జిల్లా టాప్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, నల్లగొండ జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రణాళికాశాఖ జనాభా, విద్య, ఆర్థిక, సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ఇటీవల విడుదల చేసిన అట్లాస్‌లోనూ ఇదే అంశం స్పష్టమైంది. జిల్లాలో అంతర్జాతీయ విమానాశ్రయానికి తోడు ఔటర్ రింగ్‌రోడ్డు ఉండటం కలిసి వచ్చింది. కావాల్సినన్ని భూములు అందుబాటులో ఉండటం.. ఇతర ప్రాంతాలతో పోలిస్తే, కావాల్సినంత మ్యాన్‌పవర్ అందుబాటులో ఉండటం.. ఉద్యోగుల వేతనాలు కూడా చాలా తక్కువగా ఉండటంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఐటీ అనుబంధ సంస్థలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలే కాదు రియల్ ఎస్టేట్ రంగం సైతం ఇక్కడ ఎక్కువగా పెట్టుబడులు పెడుతుండటంతో జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఫలితంగా జిల్లా వాసుల సగటు వార్షిక ఆదాయం భారీగా పెరిగింది. వస్తు ఎగుమతి, దిగుమతి కూడా జిల్లా నుంచే అత్యధికంగా జరుగుతోంది.



గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో సగటు తలసరి ఆదాయం ఇలా..

జిల్లా	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
రంగారెడ్డి	5,90,015	6,23,555	6,73,280	8,01,003	9,54,949
హైదరాబాద్	3,56,398	3,64,058	3,34,050	4,07,222	4,97,854
సంగారెడ్డి	2,29,464	2,57,451	2,47,531	2,91,621	3,21,799
మేడ్చల్	2,13,362	2,28,798	2,09,054	2,51,709	2,95,214
నల్లగొండ	1,57,441	1,97,796	2,00,470	2,38,040	2,62,619

క్లుప్తంగా

మాస్టర్ అథ్లెటిక్స్‌లో తాండూరువాసుల సత్తా



మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు అందుకుంటున్న మాస్టర్ అథ్లెట్స్

తాండూరు టౌన్: మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్‌లో తాండూరు వాసులు సత్తా చాటారు. ఆదివారం హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో 35 నుంచి 90 ఏళ్ల వయసు గల వారికి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పద్మనాభరెడ్డి మూడు కిలోమీటర్ల కాలినడక, 800 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, మెట్లి ఆశన్న 800 మీటర్ల రన్నింగ్, మూడు కిలోమీటర్ల కాలినడకలో తృతీయ స్థానం, వెంకటేశ్ ఐదు కిలోమీటర్ల కాలినడక, 1,500 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం, దేవనూర్ ఆశన్న 100 మీటర్ల రన్నింగ్, జావెలిన్‌త్రోలో తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వ్యవస్థాపకుడు వై.రామారావు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మహంతీపూర్ శివారులోని కాగ్నా వాగులో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని తహసీల్దార్ పద్మావతికి సోమవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తమ గ్రామ శివారులోని కాగ్నా వాగులో నిత్యం విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ట్రాక్టర్ల కొద్దీ ఇసుకను తోడేస్తూ, డంపుల కొద్దీ నిల్వ చేస్తున్నారని ఫిర్యాదు మహంతీపూర్ గ్రామస్తులు ఫిర్యాదు పత్రంలో విజ్ఞప్తి చేశారు. దీనిపై తహసీల్దారు స్పందించి సిబ్బంది కొరత ఉందని, చర్యలు తీసుకుంటామన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

అనంతగిరి: తెలంగాణ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ తన చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి, టీఎస్ మెసా అధ్యక్షుడు మహ్మద్ యూనుస్, రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్ అహ్మద్, జిల్లా ప్రతినిధులు సయ్యద్ జహీరుద్దీన్, ఫర్హీన్ ఖాతూన్, సమత్‌అలీ, నఫీస్ ఫాతిమా, సయ్యద్ అసద్ అలీ, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఎదురెదురుగా ఢీ

ఇద్దరికి గాయాలు



క్షతగాత్రుడి వద్ద కుటుంబీకులు

మర్పల్లి: ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని పట్లూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పట్లూరుకు చెందిన మోముల మోహన్ తమ బంధువుతో కలిసి బైక్‌పై మొగిలిగుండ్ల గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా బుదేరా క్రాస్ రోడ్ నుంచి మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామానికి చెందిన రమేశ్ తన కారులో వస్తున్నాడు. పట్లూర్ శివారులో కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన గ్రామస్తులు క్షతగాత్రులను ఓ వాహనంలో సంగారెడ్డి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన

బంజారాహిల్స్: మానవ అక్రమ రవాణా నిర్మూలనపై రంగారెడ్డి, సంగారెడ్డి, నల్లగొండ, మేడ్చెల్, మల్కాజిగిరి, సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి జిల్లాలకు చెందిన డీపీఎంలు, ఏపీఎంలు, వీఓఏలకు సోమవారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ సరిత మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం జరిగే తీరు, బాధితురాలిపై ప్రభావాలు, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, చట్టాలు, భరోసా, చైల్డ్‌లైన్, పోలీసు టోల్‌ఫ్రీ నెంబర్స్ తదితర అంశాలపై అవగాహన కలిగించారు.

భూలోక స్వర్గం.. భూకైలాస్

'హర హర మహాదేవ.. శంభో శంకర' అని శివరాత్రి పర్వదినాన మార్మోగడానికి శివాలయాలు సిద్ధం అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాల్లో ఆధ్యాత్మికశోభ ఉట్టిపడుతోంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



భూకైలాస్ దేవస్థానం

తాండూరు రూరల్: పచ్చని ప్రకృతి సోయగాల మధ్య వెలసిల్లిన మండల పరిధిలోని అంతారం తండా ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం భూకైలాస్ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మహాశివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు శంకర్‌నాయక్ పవార్, వాసునాయక్ పవార్ పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. దేవస్థాన ఆవరణలో 65 అడుగుల శివుడి విగ్రహం, 30 అడుగుల ఆంజనేయస్వామి, కాలభైరవుడు, వీరభద్రేశ్వరుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు.

నీటిమార్గం గుండా దర్శనం

భూకై లాస్ దేవస్థానంలో నీటి మార్గం గుండా భక్తులు వెళ్లి పరమశివుడిని దర్శించుకోవాలి. మహా శివరాత్రి సందర్భంగా వివిధ విగ్రహాలు దర్శన మిస్తాయి. 18 శక్తి పీఠాలు, శనేశ్వరుడు, రేణుకాఎల్లమ్మ, నవగ్రహాలు, కోనేరులో బుద్ధుడి విగ్రహం బ్రహ్మోత్సవాల్లో ఆకర్షణగా నిలుస్తాయి. ప్రకృతి రమణీయతల మధ్య భక్తులకు దేవతామూర్తులను భక్తులు దర్శించుకోవచ్చు.

కార్యక్రమాల వివరాలు

భూకై లాస్ జ్యోతిర్లింగ దేవస్థానంలో నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం స్వస్తి పుణ్యాహవాచనం, అంకురార్పణ, మండపారాధన, యాగశాల ప్రవేశం, లక్ష్మీ గణపతి హోమం కార్యక్రమాలు ఉంటాయి. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకం, పల్లకీసేవ, చండీయాగం, 12 జ్యోతిర్లింగాలకు అభిషేకం, బోనాల ఊరేగింపు, రాత్రికి అగ్నిగుండాల ప్రవేశం, గురువారం శివపార్వతుల పల్లకీ సేవ, ఆ తర్వాత కల్యాణం, పూర్ణాహుతి, శుక్రవారం భవాని మాత పూజతో ఉత్సవాలు ముగిస్తాయి.



కోనేరులో బుద్ధుడి విగ్రహం

ముస్తాబైన శివాలయాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న శ్రీ బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. శ్రీరామచంద్రుడిచే లింగరూపంలో ప్రతిష్ఠించబడిన శివుడు అనంతగిరి అడవుల్లో బుగ్గ రామలింగేశ్వరుడిగా కొలువయ్యాడు. భక్తుల కొంగు బంగారంగా వెలిసి భక్తులతో నిత్యం పూజలందుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహనంతో ప్రారంభమవుతాయి. బుధవారం శివరాత్రి రోజు ఉదయం సుప్రభాతసేవ, ప్రత్యేక అభిషేకాలు, స్వామివారి దివ్య దర్శనం, రాత్రికి ప్రత్యేక సామూహిక భజనలు, జాగరణ, అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకంతో పాటు తెల్లవారుజాము వరకు జాగరణ భజన కొనసాగుతాయని తెలిపారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గాను వికారాబాద్ నుంచి బుగ్గ వరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. వికారాబాద్ ప్రాంతంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు మండలంలోని పులుసుమామిడి సమీపంలో వెలిసిన శ్రీ పార్వతీపరమేశ్వరుల ఆలయం, పీరంపల్లి బుగ్గ రామేశ్వరాలయం, పట్టణంలోని మల్లికార్జున స్వామి ఆలయం, రామమందిరం, అన్నపూర్ణసహిత విశ్వనాథస్వామి ఆలయాలు మహా శివరాత్రి కోసం ముస్తాబయ్యాయి.



ముసాబైన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం

అలంకరణలో ఆలయం

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని లింగమయ్య దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మహాశివరాత్రి పర్వదినం రోజున ఉత్సవాలు ప్రారంభమవుతాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. 27న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పరమేశ్వరుడిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి రవికుమార్

నెల రోజుల పాటు సోలార్ టెక్నీషియన్ తరగతులు

తాండూరు టౌన్: ఉచిత సోలార్ టెక్నీషియన్ శిక్షణను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సెంబ్‌కార్ప్ కంపెనీ ప్రతినిధి రవికుమార్ కోరారు. సోమవారం తాండూరు బస్టాండు ఎదురుగా ఉన్న ఏఎస్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూషన్‌లో పీపల్ ట్రీ ఫౌండేషన్, సెంబ్‌కార్ప్ కంపెనీల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత సోలార్ టెక్నీషియన్ శిక్షణను ప్రారంభించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా స్కిల్ ఇండియా కార్పొరేషన్ నేతృత్వంలో సోలార్ కంట్రోల్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సులో ఉచితంగా యువతీ యువకులకు 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నేటి ఆధునిక ప్రపంచంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేయడం ఇబ్బందిగా మారిందన్నారు. మొత్తం 200 మందికి శిక్షణ ఇవ్వనుండగా తొలి విడతలో 100 మందికి శిక్షణను సోమవారం ప్రారంభించామన్నారు. మరో బ్యాచ్ కూడా త్వరలోనే ప్రారంభం కానున్నట్లు చెప్పారు. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న శాంతినగర్ పార్కు పక్కన ఏఎస్ కంప్యూటర్ సెంటర్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు. పీపల్ ట్రీ ఫౌండేషన్ డైరెక్టర్ రహమాన్, ఎస్‌ఐ సాజిద్, ఎఎస్‌ఐ అంబదాసు, ఏఎస్ కంప్యూటర్ డైరెక్టర్ పద్మనాభ రెడ్డి, ఇన్‌చార్జి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంజర్ల అనంత పద్మనాభస్వామి సన్నిధిలో స్పీకర్

కొత్తూరు: అనంత పద్మనాభస్వామి ఆలయాల్లో కేరళ, వికారాబాద్ తర్వాత కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో ఉన్న ఆలయం ఎంతో ప్రఖ్యాతి గాంచిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆలయ పునర్నిర్మాణ వేడుకల సందర్భంగా సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఆలయ కమిటీ చైర్మన్ అనితారెడ్డి స్పీకర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఏఐసీసీ నేత చల్లా వంశీచంద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపండి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేందర్‌గౌడ్ తదితరులు

బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజేందర్‌గౌడ్

అనంతగిరి: వికారాబాద్‌లో అండర్ గ్రౌండ్ లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజేందర్‌గౌడ్ కోరారు. సోమవారం ఆయన వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు, అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వికారాబాద్ నుంచే ప్రక్షాళన చేపట్టాలన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలో అయితే మూసీ కలుషితమవుతుందో ఆ ప్రాంతాన్ని సందర్శించి కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వాటర్ పట్టణంలోని పలు చోట్ల లీకేజీలు అవుతున్నాయన్నారు. దీంతో తాగునీరు సైతం కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గఫార్, సత్యనారాయణ, యాదయ్య, భరత్, షాబాస్, సురేందర్‌రెడ్డి, నరసింహ, నగేశ్, సాజిద్, శ్రీనివాస్, రాఘువేందర్‌రెడ్డి, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత జలాలతో పంటలకు నష్టం

షాబాద్: భూగర్భ జలాల కలుషితంతో వరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధి ఎల్గొంగూడ గ్రామానికి చెందిన రైతు నర్సింహులుగౌడ్.. ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని, బోరు నీటితో వరి పంటను సాగు చేశాడు. నారు వేసిన 15 రోజులకే పంట మొత్తం చనిపోయింది. దీనికి కారణం సమీపంలోని పరిశ్రమే అని, ఆ కంపెనీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమై పంటలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. చాలా మంది రైతుల పరిస్థితి ఇదేనని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సదరు పరిశ్రమపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని, ఫలితంగా కంపెనీ నుంచి వెలువడే పొగ, దుమ్ము, ధూళితో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని వాపోయారు. కలుషిత నీరు తాగిన పక్షులు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు.



ఎల్గొండగూడలో దెబ్బతిన్న వరి పంట

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పరిగి: 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ హరికృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. పరిగి మున్సిపాలిటీతో పాటు రంగంపల్లి, రాపోల్, సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

పూడూరు: అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని మన్నెగూడ మార్కెట్ యార్డు సమీపంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను జేసీబీతో కూల్చివేశారు. తమ పట్టాభూమిలో నిర్మాణాలు చేశారని సదరు పట్టదారు కోర్టును ఆశ్రయించాడని తెలిపారు. నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో నిర్మాణాలను తొలగించామన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

యువతి అదృశ్యం

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ కుమార్తె తహసీన్ ఫాతిమ(23) ఇంటి వద్దే ఉండేది. ఈ నెల 22న సాయంత్రం గౌస్ భార్య సాఫియా బేగం షాపింగ్ కోసం చార్మినార్‌కు వెళ్లింది. రాత్రి 9 గంటలకు వచ్చి చూడగా ఇంట్లో యువతి కనిపించలేదు. తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సాఫియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆమె వివరాలు తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ లేదా 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మరో వ్యక్తి..

కందుకూరు: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన మార్ప అంజయ్య(50) కందుకూరులోని కుమార్తె వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తుండేవాడు. అతనికి అప్పుడప్పుడు మానసిక స్థితి సరిగా ఉండదు. కాగా ఈ నెల 21న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. అప్పటి నుంచి తెలిసిన చోట వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో కుటుంబీకులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

గచ్చిబౌలి: ఇంటి మరమ్మతు పనులు చేస్తూ ప్రమాదవశాత్తు భవనం 12వ అంతస్తు నుంచి కింద పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ నగర్‌జిల్లాకు చెందిన లక్ష్మణ్(37) నగరానికి వలస వచ్చి నార్సింగి ప్రాంతంలో నివాసం ఉంటూ కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం అతను గచ్చిబౌలి, బాంబూస్ అపార్ట్‌మెంట్స్‌లోని 12 అంతస్తులో పునర్నిర్మాణ పనుల్లో పాల్గొన్నాడు. గాలి రాకపోవడంతో కిచెన్ విండోకు ఉన్న గ్లాసు డోర్ తెరిచి పనులు చేస్తున్న అతను ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

చోరీ కోసం వచ్చి హత్య చేశారని కుటుంబసభ్యుల ఆరోపణ



వినోదమ్మ (ఫైల్)

మర్పల్లి: అనుమానాస్పదస్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామంలో కలకలం రేపింది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన తోకల వినోదమ్మ(65), కమల్‌రెడ్డిలకు విమలమ్మ, జ్యోతి సంతానం. కరోనా సమయంలో భర్త చనిపోవడంతో వినోదమ్మ ఒంటరిగా ఉంటుంది. అప్పుడప్పుడు కుమార్తెల వద్దకు వెళ్లొస్తుంది. ఇటీవల కూతురు వద్దకు వెళ్లొచ్చిన ఆమె ఇంటివద్దనే ఉండేది. సోమవారం ఉదయం వినోదమ్మ ఇంటి నుంచి పొగలు వెలువడ్డాయి. దీంతో చుట్టుపక్కల వాళ్లు గమనించి తలుపులు బద్దలు కొట్టారు. బీరువాలో సామగ్రి చిందరవందరగా పడి ఉంది. వస్తువులన్నీ తగలబడి ఉన్నాయి. ఇంట్లోనే ఉన్న బావి వద్ద వినోదమ్మ చెప్పులు కనిపించాయి. దీంతో ఆమె ఆచూకీ కోసం బావిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. చోరీ నిమిత్తం వచ్చిన దుండగులు గొంతు నుమిలి హత్య చేసి, బావిలో పడేశారని కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పెద్దకూతురు విమలమ్మ ఫిర్యాదు మేరకు మోమిన్‌పేట్ సీఐ నవీన్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

విషయం తెలుసుకున్న వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలం చేరుకొని డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం, సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులు, కుటుంభసభ్యులతో మాట్లాడారు. హత్యనా? ఆత్మాహత్యనా అనే విషయాలపై దర్యాప్తు చేసి వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

మనఊరు-మనబడి బిల్లులు చెల్లించండి

ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతికి కాంట్రాక్టర్ల వినతి

దోమ: మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టిన తమకు బిల్లులు చెల్లించకుండా చిన్న చూపు చేస్తోందని దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ ఎంఓఎంబీ కాంట్రాక్టర్లు వాపోయారు. సోమవారం బొంపల్లి పాఠశాలకు విచ్చేసిన ట్రెయినీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి తమ గోడు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగారం తాకట్టు పెట్టి, అప్పులు చేసి పనులు చేపట్టామని వాపోయారు. రెండు నెలల క్రితమే జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల కాంట్రాక్టర్లకు ఎంఓఎంబీ కింద చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించారని.. తమకు మాత్రం ఇప్పటి వరకు బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క కాంట్రాక్టర్‌కు రూ.20 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం తమ బిల్లులను చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేదంటే పాఠశాలలకు తాళం వేస్తామని హెచ్చరించారు.



ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

పరిహారం పెంచి ఇవ్వండి



సమావేశంలో అధికారులకు గోడు విన్నవిస్తున్న రైతులు

- టీజీఐఐసీకి భూములు కోల్పోయిన రైతుల డిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: టీజీఐఐసీకి భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం పెంచి ఇవ్వాలని భూ బాధితుల కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని ఎల్మినేడు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, టీజీఐఐసీ మేనేజర్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు వారి సమస్యలను ఏకరువు పెట్టారు. ఎల్మినేడులో వివిధ పరిశ్రమల ఏర్పాటు కోసం టీజీఐఐసీ ద్వారా భూములు సేకరించిన ప్రభుత్వం సరైన పరిహారం ఇవ్వలేదని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ పరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. ఎకరం భూమి కోల్పోయిన రైతుకు ఎకరానికి 121 గజాల ప్లాటు, ప్రస్తుతం ఉన్న వాల్యూ ప్రకారం ఎకరానికి రూ.30 లక్షలు చెల్లించాలన్నారు. 2013 ఆర్ఎన్ఆర్ ప్యాకేజీ ప్రకారం పరిహారం ఇస్తే బాగుంటుందన్నారు. గతంలో జరిగిన అవకతవకలపై రీ సర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డీఓ అనంతరెడ్డి మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించేలా కలెక్టర్‌తో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలో భూములు కోల్పోయిన పలువురు రైతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని ఒకరి మృతి

ఇద్దరికీ తీవ్ర గాయాలు

పరిగి: రెండు ద్విచక్ర వాహనాలను కంటైనర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణ కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపల్లి గ్రామానికి చెందిన ముస్టే శ్రీశైలం(19) పరిగి నుంచి రంగంపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. పట్టణ శివారులోని కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్ సమీపంలో కొడంగల్ వైపు నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ వాహనం రెండు బైక్‌లను ఢీకొంది. దీంతో శ్రీశైలం తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందగా, మరో బైక్‌పై ఉన్న సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రులను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించారు.